బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శికి సత్కారం



బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ ఎన్.గౌతమ్‌రావును మంగళవారం నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్ నేతృత్వంలోని ఆ పార్టీ డివిజన్ నాయకులు శాలువాకప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్, బీజేపీస్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎం.మధుయాదవ్, డివిజన్ ప్రధానకార్యదర్శి ఎం.బి.కిషోర్‌కుమార్, ఎం.శ్యామ్ ముదిరాజ్, కె.బీ.రాజు తదితరులు పాల్గొన్నారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి.

'రూ.210 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి'

నల్లకుంట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో రెండు సంవత్సరాలలో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద రూ.210 కోట్ల నిధులను చెల్లించలేదని, దీంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బకాయిలు చెల్లించకపోతే పాఠశాలలను మూసివేస్తామని హెచ్చరించినా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) నేతలు ఆరోపించారు. ఈ పెండింగ్ నిధుల కారణంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ముకుందకు ఈ అంశంపై పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మంద నవీన్, సహాయ కార్యదర్శులు తీగల శ్యామ్, ఆసిఫ్, కోశాధికారి జాన్సీ తదితరులు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

యూపీహెచ్‌సీ వైద్యాధికారిగా డా.సంజూ సుధ



ముషీరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారిగా డాక్టర్ బి.సంజూసుధ మంగళవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషిచేస్తానన్నారు. మురికివాడ ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

● కాంగ్రెస్ సీనియర్ నేతకు పరామర్శ



అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత మనోజ్‌పెర్షద్ సేఠిని మంగళవారం నగరంలోని ఆయన నివాసంలో టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలోని పరామర్శించారు. వైద్యపరంగా మీకు పూర్తి సహకారం అందిస్తామని ఆయనకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఓబీసీఎల్ వైస్‌చైర్మన్ కట్టెల సుభాష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, పీ.ఎల్.శ్రీనివాస్, ఆనంద్, వెంకటేష్, ప్రవీణ్, మురళీ, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి

ప్రేమ్‌నగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర

అంబర్‌పేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ మంగళవారం డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. బస్తీవాసుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. బస్తీలో ప్రధానంగా ఉన్న లోప్రెషర్‌ను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు నూతన 11కేవీ కేబుల్ వైర్లను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.



సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు, నిరుద్యోగులు

గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

పంజాగుట్ట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని పలువురు నిరుద్యోగులు అన్నారు. స్థానికసంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే స్థానిక ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో కాంగ్రెస్ ప్రభుత్వానికి చూపుతామని హెచ్చరించారు. ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చినా నోటిఫికేషన్లు ఎందుకు ఇవ్వడం లేదు, ఖాళీలు ఎందుకు భర్తీ చేయడం లేదని వారు ప్రశ్నించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో రెండు లక్షల ఉద్యోగాల సాధన కోసం నిరుద్యోగుల పోరుబాట' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. జేఏసీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. నిరుద్యోగ యువత మీద రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని మండిపడ్డారు. స్థానికసంస్థల ఎన్నికలకు ముందే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలన్నారు. ఉద్యోగాల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఝాన్సీ, ఎడపాక రవి, బండారి రాజు, కృష్ణమూర్తి, ఉమ, వర్ధన్, గోపీచంద్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

'టీజీపీఎస్సీ తప్పిదాలతో నిరుద్యోగుల గందరగోళం'

నల్లకుంట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) చేస్తున్న వరుస తప్పిదాలతో నిరుద్యోగ యువత గందరగోళంలో పడ్డారని, ఒక్క గ్రూప్-1 పరీక్షను ఇప్పటికే మూడుసార్లు రాశారని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటా రమేష్, ఆనగంటి వెంకటేష్ పేర్కొన్నారు. టీజీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో తప్పిదాలు జరిగాయని కొంతమంది అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లడంతో.. నేడు హైకోర్టు గ్రూప్-1 పరీక్ష పేపర్లను తిరిగి మూల్యాంకనం చేయాలని, లేనట్లయితే పరీక్షనే తిరిగి నిర్వహించాలని తీర్పు నివ్వడం జరిగిందని వారన్నారు. మంగళవారం విద్యానగర్‌లోని కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసిన తర్వాత కూడా తిరిగి తప్పిదాలు చేయడంతో నిరుద్యోగ యువత తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. టీజీపీఎస్సీని తీర్చిదిద్ది పారదర్శకంగా నియామకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కోర్టు కేసులు లేకుండా వివాదాలు లేకుండా గ్రూప్ - 1 నియామకాలను చేపట్టాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మెరిట్ లిస్ట్ రద్దుతో అంధకారంలో అభ్యర్థుల భవిష్యత్

చిక్కడపల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల మెరిట్ లిస్ట్ రద్దుతో అభ్యర్థుల భవిష్యత్ అంధకారంగా మారిందని ఎల్ఎస్ఎఫ్ఐ(లా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) తెలంగాణ రాష్ట్ర సహ కన్వీనర్ బి.చంద్రకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు తీర్పు ప్రకారం గ్రూప్-1 పరీక్షలను మళ్లీ మూల్యాంకనం చేయడం లేదా తిరిగి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించడంతో ఇప్పటికే విడుదలైన మెరిట్ లిస్ట్ రద్దు కావడం దురదృష్టకరమన్నారు. ఈ ఆకస్మిక రద్దుతో వారు కన్న కలలు, ఆశలు చిన్నాభిన్నం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడైనా ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించి పారదర్శకతను పాటించి, కష్టపడి చదివిన విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.

మహనీయుడు కాళోజీ

రాంనగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాడు స్వాతంత్ర్య పోరాటం, తెలంగాణ, గ్రంథాలయ ఉద్యమంలో కాళోజీ నారాయణరావు పాల్గొని ఉద్యమ జీవిగా బతికాడని, ఆయన మహనీయుడని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభు, ఆచార్యులు డాక్టర్ మహంతయ్య పేర్కొన్నారు. మంగళవారం విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ ఆర్.రమాదేవి, ఆచార్య జగన్‌మోహన్, ఆచార్య బాణాల శ్రీనివాసరావు, డాక్టర్ కె.నీరజ, డాక్టర్ సుభాష్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఓ.పద్మజ, డాక్టర్ రమావత్ శ్రీను, డాక్టర్ జి.మల్లికార్జున్, డాక్టర్ విరాళ సంతోషి, డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్, డాక్టర్ ఎల్.విజయ, డాక్టర్ వి.కల్యాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కె.ప్రభు, డాక్టర్ మహంతయ్య తదితరులు

స్వరాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తి



ప్రజాకవి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పించిన పోచంపల్లి రమణారావు తదితరులు

నల్లకుంట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వరాష్ట్ర ఉద్యమానికి తన రచనలతో స్ఫూర్తి నింపిన తెలంగాణ సాంస్కృతిక సౌరభం ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమైక్య అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు పేర్కొన్నారు. తన సాహిత్యంతో తెలంగాణ భాషలోని మాధుర్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు అని కొనియాడారు. మంగళవారం నల్లకుంటలోని సంఘం కార్యాలయంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమైక్య ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమైక్య ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, గూడ రాజేశ్వరరావు, గూడ జయరాం, నర్వా రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కాళోజీకి నివాళులర్పిస్తున్న పొట్లూరు పద్మజ తదితరులు

రచనల ద్వారా ఉద్యమస్ఫూర్తి రగిలించిన కాళోజీ

చిక్కడపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల్లో తెలంగాణ సాధన ఉద్యమ స్ఫూర్తిని రగిలించారని, ఆయన కవితలు జనసామాన్య వాడుకభాషలో ఉంటాయని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూ పద్మజ అన్నారు. చిక్కడపల్లిలోని సిటీసెంట్రల్ లైబ్రరీలో మంగళవారం తెలంగాణ ఉద్యమస్ఫూర్తి, రచయిత, కవి కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన పొట్లూరు పద్మజ మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలం నుంచి ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని పెంచారని, అవినీతిని, అన్యాయాన్ని ఎదిరించే గొప్ప ధీశాలి, ప్రజాకవి కాళోజీ అన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు ఎల్.చంద్రకళ, బి.ప్రతిభారెడ్డి, ఎం.వెంకటేష్‌యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, పీవీఎం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు



అనాథాశ్రమంలో విద్యార్థినులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ కల్పన యాదవ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు నాగభూషణం గౌడ్

ముషీరాబాద్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవ చేసేవారికే సమాజంలో ప్రత్యేక గుర్తింపు, స్థానం లభిస్తుందని మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనయాదవ్ అన్నారు. మంగళవారం ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా ముషీరాబాద్ రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో బాలికలకు పండ్లు, స్వీట్లు పంపిణీచేశారు. ఈ వేడుకలను మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనయాదవ్, డివిజన్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్, నియోజకవర్గం కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని అన్నారు. ముషీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అంకిత భావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రె స్ పార్టీ సీనియర్ నాయకుడు డి.వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శి రాజ్‌దీప్, జిల్లా ప్రధానకార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్, భవాని శంకర ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు లింగం గుప్తా, మురళీమోజేస్, అమరేందర్, రమేష్‌గౌడ్, జయకుమార్, నవీన్, రాజు, రాంనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జువేర్ హుస్సేన్, కృష్ణవేణి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాంనగర్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్రకార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ నగర సీనియర్ నాయకుడు ఆవుల లోకేయాదవ్ ఆధ్వర్యంలో ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ జన్మదిన వేడుకలు మంగళవారం బాగ్‌లింగంపల్లిలో జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సేవా కార్యక్రమాలు, కేక్ కటింగ్ కార్యక్రమానికి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి సేవా కార్యక్రమాలను ప్రారంభించి, మాట్లాడారు. అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్, రాంనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జుహేరి హుస్సేన్, నాయకులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



బాగ్‌లింగంపల్లి లంబాడీ తండాలో సేవాలాల్ జెండాను ఆవిష్కరిస్తున్న సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ నాయక్

లంబాడీ హక్కుల సాధనకు కృషి

రాంనగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సేవాలాల్ సేన లంబాడీ హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ తండాలో సేవాలాల్ సేన వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ సభ సేవాలాల్ సేన రాష్ట్ర నాయకుడు హుస్సేన్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సేవాలాల్ సేన చేసిన పోరాటం ఫలితంగా తండాలో తమ రాజ్యాన్ని నిర్మించుకుందాం, సాధించుకుందామన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న సోయం బాబురావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ లంబాడీలు ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని వేసిన కేసును వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కల్యాణ్ నాయక్, నాయకులు సోముల నాయక్, రాజు రాథోడ్, లాలు నాయక్, హేలకృష్ణ నాయక్, ప్రవీణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'స.హ' రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా దిలీప్‌రావు

బర్కత్‌పుర, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్.దిలీప్‌రావు నియమితులయ్యారు. మంగళవారం కాచిగూడలో సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు శ్రావంతి, జాతీయ ప్రధానకార్యదర్శి మల్లం వెంకటేశ్వర్లు ఎన్.దిలీప్‌రావుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దిలీప్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను బట్టబయలు చేస్తూ సమాచార హక్కు చట్టంపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు.

యూరియాపై కేంద్రం తీరును వ్యతిరేకిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు రేపు

చిక్కడపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతకు కారణమైన కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, తక్షణం యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి. సాగర్ పిలుపునిచ్చారు. ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం తన విధానాలను ఇప్పటికైనా మార్చుకుని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘంనేతలు జంగారెడ్డి అరిబండి ప్రసాదరావు, మూడ్ శోభన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ఘనంగా గురువుల దినోత్సవం



బాగ్‌అంబర్‌పేట డివిజన్ తురాబ్‌నగర్‌లోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం గురువుల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయుల విశిష్ట సేవలను గుర్తించి, వారిని ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీ, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చంద్రమోహన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

రెండురోజుల్లో కమ్యూనిటీహాల్ పునరుద్ధరణ షురూ



కమ్యూనిటీహాల్‌ను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు, పరిరక్షణ కమిటీ సభ్యులు, బీజేపీ నేతలు

చిక్కడపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ పనులు మరో రెండురోజుల్లో ప్రారంభం కానున్నాయని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ పేర్కొన్నారు. రూ.26 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులు కమ్యూనిటీహాల్ పునరుద్ధరణకు మంజూరు చేయించామన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వైరింగ్ పనులు, హాల్‌లోని మరుగుదొడ్ల రిపేర్లు, నీటి సౌకర్యం, బోరింగ్ రిపేర్, కమ్యూనిటీహాల్‌కు రంగులు, నూతన గేటు, హాలు పేరుతో కూడిన కమాన్ ఏర్పాటు పనులు కాంట్రాక్టర్ వీరేందర్ పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ వ్యాయామశాల, ఆటస్థలం, కల్యాణ మండపం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు నర్మెట్ట మల్లేష్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పనులను కార్పొరేటర్ పరిష్కరించడం అభినందనీయమన్నారు. కార్పొరేటర్ సూచనల మేరకు మంగళవారం జీహెచ్‌ఎంసీ ఏఈ అబ్దుల్‌సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ నేతలు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, సాయిచంద్, ఆనంద్‌రావు, పరిరక్షణ కమిటీ సభ్యులు మల్లేష్, కృష్ణ, గుండు మహేందర్, దినేష్, సతీష్, గుండు జగదీష్, మారిశెట్టి నర్సింగ్‌రావు, రాము కమ్యూనిటీహాల్‌ను పరిశీలించారు.

ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలి



అరవింద్‌కుమార్ యాదవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేడే దేవదాస్

చిక్కడపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ కవేలిగ్రౌండ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేడే దేవదాస్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాలను సందర్శించి సౌకర్యాల కల్పనగురించి తెలుసుకున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ ఎంపీ నిధుల నుంచి పాఠశాలలోని పాడైపోయిన పవర్‌బోర్‌కు రిపేర్ చేయించాలని, పాఠశాల పై అంతస్థులో రెండు తరగతి గదులను నిర్మించాలని, నాలుగు కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని, పాఠశాలకు వచ్చేదారిలో సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ తప్పనిసరిగా ఆయా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ నగర పాలిక సంఘటన్ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ గుర్రం శంకర్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శులు బంటారం యాదగిరిగౌడ్, శీలం సత్యనారాయణ, గుండు జగదీశ్‌బాబు, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్‌కెన్నడీ, సీనియర్ నేత కృష్ణయాదవ్, నర్సింగ్‌ముదిరాజ్, మారిశెట్టి నర్సింగ్‌రావు, హఫీజ్, మజర్, మధుమతి, పుస్తకాల కవిత, పాఠశాల టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో మానసిక సంతృప్తి

చిక్కడపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలతో మానసిక సంతృప్తి లభిస్తుందని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి గుండు జగదీశ్‌బాబు అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమిటీ హాల్ వద్ద పేదలకు పండ్లను ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ జన్మదిన సందర్భంగా పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్ హాజరై, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదగిరిగౌడ్, జయేందర్‌బాబు, అభిషేక్‌కెన్నడీ, బాబురావు, భాస్కర్‌రెడ్డి, రాజేష్, ఆసిఫ్‌భాయ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. ఆజామాబాద్ ఐఈ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు, రామ్‌నగర్ పరిధిలో 11నుంచి 11.30 గంటల వరకు, ఆర్‌వోఎమ్ పరిధిలో 12 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, ప్రివెంటివ్ మెడిసిన్, బతుకమ్మకుంట పరిధిలో 2నుంచి 3 గంటల వరకు, ఆప్కో పరిధిలో 3.30నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

12న టీచర్స్ డే సెలబ్రేషన్స్

చిక్కడపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తులసిభవన్ డివోషనల్ లిటరరీ, కల్చరల్ స్టడీస్ ఆధ్వర్యంలో ఈనెల 12న ఉదయం 10 గంటలకు త్యాగరాయ గానసభలో టీచర్స్ డే వేడుకలు నిర్వహిస్తున్న ఆ సంస్థ డైరెక్టర్, ప్రముఖ విద్యావేత్త ప్రొ.ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ టీచర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్లను సత్కరిస్తామని రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ వైస్‌చైర్మన్ ప్రొ.ఈ.పురుషోత్తమ్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు.

జీహెచ్‌ఎంసీ, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీజేపీ విజయం



డా.గౌతమ్‌రావును సత్కరిస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి తదితరులు

బర్కత్‌పుర, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ విజయాన్ని ఏ శక్తులూ అడ్డుకోలేవని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. 2028లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి తీరుతుందని, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పట్ల విరక్తి చూపుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నూతనంగా నియమితులైన సందర్భంగా మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయం వద్ద కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఆయనకు ఘనస్వాగతం పలికి, స్వీట్లు తినిపించారు. శాలువాపూల దండలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్దియా పీఠంపై బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృత, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, శ్యామ్‌రాజ్, ప్రధానకార్యదర్శి ఏడెల్లి అజయ్‌కుమార్, కోశాధికారి ఏ.సూర్యప్రకాష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యులకు నియామక పత్రాలను అందజేస్తున్న శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్

బూత్ స్థాయి కమిటీని విస్తృతపరుస్తాం : కాంగ్రెస్

రాంనగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ జిల్లాలో బూత్‌స్థాయి కమిటీని విస్తృతపరుస్తామని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. త్వరలో ఆలిండియా మహిళా కాంగ్రెస్ అల్కాలాంబ, రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆదేశాల మేరకు ప్రతినెలా మొదటి వారంలో ప్రతి ఒక్క జిల్లాలో విస్తృత సమావేశం చేయనున్నట్లు తెలిపారు. తద్వారా జిల్లా కమిటీలు, నియోజకవర్గం అధ్యక్షులు, బ్లాక్, డివిజన్ కమిటీలను నియమించడం జరుగుతుందన్నారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని శ్రీనివాసనగర్ కమ్యూనిటీహాల్‌లో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బూత్‌స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఆలోచన, ఆదేశాల మేరకు మహిళలకు బూత్ స్థాయిలో స్థానం కల్పించే దిశగా మహిళా కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. నాయకులు వెంకటసుబ్బమ్మ, సుజాత, బిందియా, దీపాదేవి, మాధవి, వనజ, షకీలా, అంజుమ్, కవిత, నాజియా, రేష్మ, ఆలియా, పర్హాన, నేహా, అనిత, దుర్గ పాల్గొన్నారు.



మావో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు కె.గోవర్ధన్ తదితరులు

మావో మార్గమే దేశ ప్రజలకు విముక్తి బాట

రాంనగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రామికవర్గ సిద్ధాంతవేత్త, కామ్రేడ్ మావో చూపిన మార్గమే భారతదేశ ప్రజల విముక్తికి సరైన బాట అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెగోవర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం విద్యానగర్ మార్క్స్‌భవన్‌లో కామ్రేడ్ మావో వర్ధంతి కార్యక్రమంలో మావో చిత్రపటానికి ఆయన పూలమాలలువేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశంలోని విప్లవ కమ్యూనిస్టు పార్టీలు మావో ఆలోచనా విధానాన్ని ప్రాపంచిక దృక్పథంగా ఎంచుకుని, 55 ఏళ్లుగా పోరాడుతున్నాయని గుర్తుచేశారు. మావో చెప్పినట్లుగా ప్రపంచంలోని అనేక దేశాలు స్వాతంత్ర్యాన్ని సాధించాయన్నారు. నేడు వివిధ దేశాల్లో ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.ఝాన్సీ, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎం.శ్రీనివాస్, అరుణ, పీడీఎస్‌యూ నాయకులు మహేష్, ఆసిఫ్, వంశీ, పీవోడబ్ల్యూ నాయకులు మణిమాల, ఆసిఫ్, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.